# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-08-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రేపు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు జాతినుద్దేశించి ప్రసంగిస్తారు.**

2. **ఆదాయార్జన శాఖలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సమీక్ష నిర్వహిస్తున్నారు.**

3. **రాష్ట్రంలో వర్షాలపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు.**

4. **వైయస్సార్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జిల్లా పరిషత్ స్థానాలకు జరిగిన ఉపఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు.**

5. **మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రేపటి నుండి అమలులోకి వస్తుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.**

=========================

రేపు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి ప్రసంగిస్తారు. ఈరోజు సాయంత్రం 7 గంటలకు దేశంలోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాలు మొదట హిందీలోనూ, అనంతరం ఆంగ్లంలోనూ రాష్ట్రపతి ప్రసంగాన్ని ప్రసారం చేస్తాయి. దూరదర్శన్‌లో హిందీ, ఆంగ్ల ప్రసంగం తర్వాత స్థానిక కేంద్రాలు ప్రాంతీయ భాషల్లో రాష్ట్రపతి ప్రసంగాన్ని ప్రసారం చేస్తాయి. ప్రాంతీయ ఆకాశవాణి కేంద్రాలు రాత్రి 9 గంటల 30 నిమిషాలకు ప్రాంతీయ భాషల్లో రాష్ట్రపతి అనువాద ప్రసంగాన్ని ప్రసారం చేస్తాయి.

---------------------------

ఆదాయార్జన శాఖలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో భవిష్యత్తులో ప్రభుత్వ ఆదాయం పెరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో చర్చిస్తున్నారు. అనంతరం దృశ్యమాధ్యమం విధానంలో నీటి వినియోగదారులతో ముఖ్యమంత్రి సమావేశమవుతారు. సాయంత్రం విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో వర్షాలపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ

తెలిపారు. విజయవాడ నగరంలోని విద్యాధరపురం, బుడమేరు వంతెన, గాయత్రి నగర్ ప్రాంతాల్లో నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి మంత్రి నిన్న పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య సిబ్బంది అత్యవసర చర్యలు చేపట్టారని తెలిపారు. వర్షాలు తగ్గిన అనంతరం విజయవాడలో ఆక్రమణలు తొలగించి డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 33 సెకన్లు

---------------------------

వైయస్సార్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జిల్లా పరిషత్– జడ్పీటీసీ స్థానాలకు జరిగిన ఉపఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. కడపలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ జాతీయ విశ్వవిద్యాలయంలో ఈరోజు ఓట్ల లెక్కింపును చేపట్టారు. ఇందులో భాగంగా తొలుత ప్రకటించిన పులివెందుల ఫలితాలల్లో టిడిపి అభ్యర్థి లతారెడ్డి 6 వేల 35 ఓట్లతో గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు. అనంతరం ప్రకటించిన ఒంటిమిట్ట ఫలితాలల్లో టిడిపి అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి గెలుపొందారు. ఈ మేరకు వారు గెలుపొందినట్లు అధికారులు ధృవీకరణ పత్రాలను అందజేశారు.

---------------------------

హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలలో భాగంగా అనకాపల్లిలో ఈరోజు జాతీయ జెండాలతో ర్యాలీని నిర్వహించారు. ఎన్.టి.ఆర్ గ్రౌండ్స్ నుంచి నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు జాతీయ జెండాలతో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, , జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

---------------------------

పేదల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఇప్పటివరకు రాష్ట్రంలో 450 కోట్ల రూపాయలను అందించామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ప్రకాశం జిల్లా తూర్పునాయుడుపాలెంలోని లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఈరోజు అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి బాధిత కుటుంబాలకు ఆర్ధిక చేయూతను అందిస్తోందని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ ..27 సెకన్లు

---------------------------

మాదకద్రవ్య రహిత భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు యువతకు అవగాహన కల్పిస్తూ, ఈ పోరాటాన్ని 'ప్రజా ఉద్యమం'గా మార్చాల్సిన అవసరంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తూ.. 'జాతీయ మాదక ద్రవ్య రహిత కార్యక్రమాన్ని' నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాలను అరికట్టడం, నివారణ మార్గాలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను చేపడుతోంది. మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల పెరుగుతున్న సవాళ్లను పరిష్కరించడానికి దేశవ్యాప్తంగా నివారణ, చికిత్స, పునరావాసంపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం.

---------------------------

సూపర్ సిక్స్ అమలులో భాగంగా రేపటి నుండి అమలు చేయనున్న ఉచిత బస్సు ప్రయాణానికి మహిళలందరూ అర్హులేనని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో పలు అంశాలపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్ 29 సెకన్లు

-----------------------------

జల శక్తి అభియాన్ పథకంలో భాగంగా వర్షపు నీటి సంరక్షణకు గాను 'నేషనల్ వాటర్ మిషన్' అనంతపురం జిల్లాలోని రెండు గ్రామపంచాయతీలను ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపిక చేసిందని నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నార్పల మండలం బొందలవాడ గ్రామపంచాయతీ, గుత్తి మండలం యంగన్నపల్లి గ్రామపంచాయతీలను అవార్డుకు ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు. ఆ గ్రామ సర్పంచ్‌లు జలశక్తి మంత్రిత్వశాఖ నుంచి రేపు ఢిల్లీలో అవార్డును అందుకోనున్నారని తెలిపారు.

-----------------------------

విజయవాడ ప్రకాశం బ్యారేజీకి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశామని ఎన్‌టిఆర్ జిల్లా జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీరు రవి కిరణ్ తెలిపారు. విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వద్ద ఆయన ఈరోజు మాట్లాడుతూ, బ్యారేజ్ నుండి నాలుగు లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నామని చెప్పారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని రవికిరణ్ తెలియజేస్తూ,

వాయిస్ 32 సెకన్లు

-----------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 151 పాయింట్ల లాభంతో 80 వేల 691 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 41 పాయింట్ల లాభంతో 24 వేల 660 వద్ద ట్రేడవుతోంది.

-----------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న నాలుగు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలియజేస్తూ,

వాయిస్ ..28 సెకన్లు

=====================